క్లుప్తంగా

ఆళ్లగడ్డ ఎస్‌ఐగా జయప్ప



ఆళ్లగడ్డ: పట్టణ ఎస్‌ఐగా జయప్ప శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న జయప్పను ప్రభుత్వం నంద్యాల జిల్లాకు బదిలీ చేయగా.. ఆయనను ఉన్నతాధికారులు ఆళ్లగడ్డ పట్టణ ఎస్‌ఐగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విధుల్లో చేరారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రమేష్

చాగలమర్రి: నంద్యాల జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1,238 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు నేత్ర వైద్యాధికారి రమేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 35 మంది విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. వారికి కళ్లద్దాల కోసం అంధత్వ నివారణ సంస్థకు సిఫార్సు చేశామని చెప్పారు. హెచ్‌ఎం. కోటయ్య, ఏఎన్‌ఎం గార్లెట్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంస్కృతిని కాపాడుకుందాం



గోపూజ చేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: వేదాలు, పురాణాల్లో పేర్కొన్న విధంగా సకల దేవతా స్వరూపాలైన గోవులను పరిరక్షించుకుని మన సంస్కృతిని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెంకటరెడ్డి అన్నారు. స్థానిక అమృత లింగేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో శుక్రవారం టీటీడీ ఆధ్వర్యంలో గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు రాజేశ్ కుమార్, టీవీ వీరాంజనేయరావు, రామకృష్ణ పాల్గొన్నారు

పాము కాటుతో మహిళా కూలీ మృతి



మృతి చెందిన హుసేనమ్మ

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన కూలీ హుసేనమ్మ పాము కాటుకు గురై శుక్రవారం మృతి చెందింది. వివరాలు.. స్థానిక కూలురు రస్తాలో ఓ రైతుకు చెందిన పొలంలో మొక్కజొన్న కంకులను కోసేందుకు కూలీకి వెళ్లింది. కంకులు కోస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన తోటి కూలీలు వెంటనే చికిత్స నిమిత్తం కేరళ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఎస్పీకి వినతి



ఎస్పీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): వడ్డీ వ్యాపారం, ఆన్‌లైన్ మోసాలు, భూకబ్జాలు, మట్కా గంజాయి తదితర అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ తదితరులు శుక్రవారం ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు, డోన్, బనగానపల్లె, పాణ్యం నియోజకవర్గాల్లో వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీలతో పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఆన్‌లైన్ మోసంతో ఉపాధ్యాయుడు ఖలీల్ ఆత్మహత్య చేసుకున్నాడని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు ఎస్పీని కోరారు.

బీజేపీ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు

నంద్యాల(అర్బన్): కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యల చేసిన బీజేపీ నేతలపై శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన గాంధీ కుటుంబ సభ్యులపై అర్థం లేని ఆరోపణలు చేయడం తగదన్నారు. బీజేపీ నాయకులు మరో మారు ఇలాంటి చౌకబారు మాటలు మాట్లాడితే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ ఎస్వైడీ ప్రసాద్, నాయకులు మహమ్మద్, సుబ్బయ్య పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారుల నియామకం

మహానంది: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజు లు పూర్తయిన సందర్భంగా గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. నేటి నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

పారని నీరు..ఎండుతున్న పైర్లు

- కేసీ అధికారుల నిర్లక్ష్యంతో నూనెపల్లె సబ్ చానెల్‌కు విడుదల కాని సాగునీరు
- ఆందోళనలో రైతన్నలు



సాగునీటి కోసం కాల్వ వెంట రైతులు



ఎండిన మిరప పైరును చూపుతున్న రైతు మణిమోహన్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): శ్రీశైలం రిజర్వాయర్ పొంగిపొర్లుతున్నా కేసీ కెనాల్ అధికారుల నిర్లక్ష్యాలతో నూనెపల్లె సబ్ చానెల్‌కు సాగునీరు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండి తీవ్రంగా నష్టపోతున్నామని నంద్యాల నియోజకవర్గంలోని నంద్యాల, గోస్పాడు మండలాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీ కెనాల నూనెపల్లె సబ్ చానెల్ ద్వారా నంద్యాల మండలంలోని కానాల, సుబ్బారెడ్డి పాలెం, చాపిరేవుల, పాండురంగాపురం, మిటాఌల, పుసులూరు, ఏశివ.పురం, బిశివరాంపురం, రామ్మూర్తి కొట్టాల, గుంతలనాలతో పాటు గోస్పాడు మండలంలోని తేళ్లపురి, పసురపాడు, జూలేపల్లె, చింతకుంట్ల, ఎఎస్.కూలూరు తదితర గ్రామాల్లోనివేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. ప్రతి ఏటా సాగునీరు సంవృద్ధిగా ఉండేదని, లస్కర్లు సబ్ చానెల్ వెంట తిరిగి రైతులకు సాగునీరు అందించాల్సి ఉండగా లస్కర్లు, ఏఈల మధ్య వివాదాలతో సాగునీరు అందడం కష్టతరంగా మారిందన్నారు. సాగునీటి కోసం కాల వెంట రేయింబవళ్లు వేచి చూడాల్సి వస్తుందన్నారు. పంటల సాగు ప్రారంభంలోనే ఇలాంటి పరిస్థితి వస్తే రాబోయే రోజుల్లో సాగునీటిని అధికారులు ఏ రకంగా అందిస్తారో తెలియక అయోమయానికి గురవుతున్నామని రైతులు మణిమోహన్‌రెడ్డి, షేక్ అక్బర్, నందిరెడ్డి, ఏసేబు, జబ్బార్, రవిరెడ్డి, జగదీశ్వర రెడ్డి, జయరావు, తదితరులు వాపోతున్నారు. ఖరీఫ్ కింద సాగు చేసిన వరి, మిరప పైర్లు ఎండు దశకు చేరుకుంటున్నాయని, ఈ విషయాన్ని సంబంధిత జిల్లా స్థాయి అధికారులకు విన్నవించినా ప్రజయోజనంలలేకుండా పోయిందన్నారు. పంటలు ఎండిపోతుండటంతో పెట్టిన పెట్టుబడులు నేలపాలు అవుతున్నాయని, తమ కష్టాలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నామన్నారు. కాల్వకు నీరు రాకపోవడంతో కొంతమంది మిర్చి పైర్లను తొలగించేందుకు సిద్ధమవుతున్నారని, వరిపైరు సైతం వాడుముఖం పట్టిందని, అధికారులు స్పందించకపోతే ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ విషయమై కేసీకెనాల్ ఏఈ వెంకటేశ్వర్లు వివరణ కోరగా నూనెపల్లె సబ్ చానెల్ పరిధిలోని కానాల గ్రామానికి వెళ్లే సాగునీటి తూముకు ప్లాస్టిక్ పైప్‌లైన్ అడ్డంగా పడటంతోనే కింది ప్రాంత రైతులకు సాగునీరు వెళ్లడం లేదన్నారు. రెండు మూడు రోజుల్లో రైతులకు సక్రమంగా సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వైద్య విద్య ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): వైద్య విద్యను ప్రైవేట్ పరం చేయాలనే ఆలోచనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధనుంజయుడు, ఎర్రస్వామి కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వైద్య విద్యను చదువుకోవాలనుకునే పేద విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లేలా ఉన్న జీఓ నెం.107, 108 లను తక్షణమే రద్దు చేయాని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సురేష్ పాల్గొన్నారు.

నేడు ఉర్దూ మెటీరియల్ పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): స్థానిక కుబ్రా షాదీఖానాలో రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చేతుల మీదుగా టెట్ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఉర్దూ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ అబ్దుల్ సత్తారు శుక్రవారం తెలిపారు. ఉర్దూ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న మైనార్టీ ఉర్దూ విద్యార్థులందరికీ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఫజులూర్ రెహమాన్, అబ్దుల్ అజీజ్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శమీమ్‌భాను, అంజాద్‌షరీఫ్ పాల్గొన్నారు.

పంటల చీడపీడలను నివారించుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ రాజశేఖర్

నంద్యాల(అర్బన్): పంటలకు సోకే చీడపీడలను నివారించుకుని అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ రాజశేఖర్ రైతులకు సూచించారు. అయ్యలూరు గ్రామంలో పీడీఎస్ఎస్ అప్లికేషన్ ద్వారా పంటల చీడపీడల వ్యాధి నిర్ధారణ వ్యవస్థ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రతి రైతు ఈ అప్లికేషన్ వాడటం ద్వారా చీడపీడల నిర్ధారణ చేసుకొని సస్యరక్షణ చర్యలు చేపట్టవచ్చన్నారు. ప్రస్తుతం పిలక దశలో ఉన్న వరిపొలాల్లో సాలే, తూనీగ తదితర మిత్ర పురుగుల నివారణకు పిచికారీ చేయాల్సిన అవసరం లేదన్నారు. నత్రజని అధిక మోతాదులో వాడటం ద్వారా మొక్కలను చీడపీడలు ఆశిస్తాయన్నారు. చిరుపొట్ట దశలో ఉన్న వరికి నత్రజనితో పాటు ఎకరాకు 20 కేజీల పొటాష్ వాడితే రోగ నిరోధక శక్తి పెరిగి చీడపీడలను తట్టుకోగలదన్నారు. కార్యక్రమంలో ఏఓ ప్రసాదరావు, ఏఈఓ ముక్తార్‌బాషా, వీఏఏలు షర్మిల, అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



కొండుపల్లెలో మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారభింస్తున్న ఎంఈఓ

ఉయ్యాలవాడ : చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడా పోటీల్లో గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలన్నారు. అనంతరం కొండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వివిధ పాఠశాలల నుంచి క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులకు అండర్-14,17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, తదితర పోటీలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు నరసింహుడు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చోరీ కేసులో స్టూవర్ట్‌పురం దొంగ అరెస్ట్

బొమ్మలసత్రం: నంద్యాల త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీకి పాల్పడిన స్టూవర్ట్‌పురం దొంగను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ సూర్యమౌళి తెలిపిన వివరాలు.. ఈనెల 2న నూనెపల్లి సమీపంలోని బెన్ని కాంప్లెక్స్‌లో నివాసముంటున్న షేక్ ఇంతియాజ్ రూ.2.60 లక్షలను బ్యాగ్‌లో పెట్టుకుని సమీపంలోని ఎస్‌బీఐ బ్యాంక్ వద్దకు వెళ్తుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు నగదును అపహరించుకుని పరారయ్యారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ద్వారా గుర్తించి గాలింపు చేపట్టారు. శుక్రవారం ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న గుంటూరు జిల్లా స్టూవర్ట్‌పురం పట్టణానికి చెందిన దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. అతని వద్ద నుంచి రూ.1.50 లక్షల నగదు, స్కూటీని స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రైల్వేగేటు మూసివేత

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

మహానంది: ముందస్తు సమాచారం లేకుండా గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామం వద్ద రైల్వేగేటును మూసేయడంతో భక్తులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజయవాడ, గుంటూరు, గిద్దలూరు మీదుగా గాజులపల్లె నుంచి గాజులపల్లె రైల్వేస్టేషన్ మార్గంలో నిత్యం వేలాది మంది భక్తులు, స్థానికులు మహానందికి వస్తుంటారు. రైల్వేగేటు మరమ్మతుల పేరుతో ఎలాంటి ప్రకటన లేకుండా శుక్రవారం మూసేయడంతో ప్రయాణికులు తిరిగి నంద్యాల మార్గంలో నందిపల్లె, పెద్దకొట్టాల, పట్టణంలో నుంచి మహానందికి చేరుకున్నారు.



పడకేసిన పారిశుధ్యం

- అపరిశుభ్రంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణం



మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో ఉన్న చెత్త కుప్పలు

నంద్యాల(రూరల్): స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణం అపరిశుభ్రంగా ఉంది. ఎక్కడ చూసిన చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. ఇక్కడ మాత్రం అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. పట్టణంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పట్టణ పరిశుభ్రతపై ప్రసంగాలిచ్చే కమిషనర్.. తన కార్యాలయ పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచుకోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రమాదం అంచున ప్రయాణం !



అల్లూరు పాలేరు వాగుపై దెబ్బతిన్న వంతెన

ఉయ్యాలవాడ : కోవెలకుంట్ల, జమ్మలమడుగు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిలో మండల పరిధిలోని అల్లూరు గ్రామ సమీపంలో పాలేరు వాగుపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. రక్షణ గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వాహనాలు ఎదురెదురుగా వచ్చిన సందర్భాల్లో వంతెన అంచులకు వెలితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు పరిశీలించి వంతెనకు కనీసం మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షిద్దాం



శిరివెళ్ల మోడల్ స్కూల్ ఆవరణలో మొక్కలను నాటుతున్న డ్వామా పీడీ



చాగలమర్రిలో మొక్క నాటుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్‌హుసేన్

రుద్రవరం: మొక్కలు నాటి పర్యావరణాన్ని పెంపొందించాలని రుద్రవరం రేంజ్ అటవీ అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండలంలోని నర్సాపురం ఉన్నత పాఠశాలలో శుక్రవారం సర్పంచు శాంతకుమారి, ఎఫ్ఎస్ఓలు శ్రీనివాసరెడ్డి,రాణెమ్మ, ముక్తర్ బాషా,సిబ్బందితో కలిసి స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులతో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించి వ్యర్థాలను తొలగించారు.

శిరివెళ్ల: చెట్లు లేనిదే మానవ మనుగడ లేదని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలలో భాగంగా మోడల్ స్కూల్ ఆవరణలో మొక్కలను పీడీ నాటారు. అనంతరం మొక్కల ఆవశ్యకత, సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఏపీఎం రామసుబ్బయ్య, ఈఓఆర్డీ నాగేంద్ర, సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్, ప్రిన్సిపాల్ ఇష్రత్‌బేగం, ఈసీ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించినప్పుడే పర్యావరణం మెరుగుపడి వాతావరణంలో సమతుల్యత ఏర్పడుతుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు నరసింహుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పాఠశాల మైదానంలో కానుగ, చింత, వేప, వివిధ రకాల మొక్కలు ఉపాధి హామీ పథకం కింద నాటించినట్లు ఏపీఓ రవిప్రకాష్ తెలిపారు.

చాగలమర్రి: ప్రతి ఒక్కరూ ఓ మొక్క నాటాలని బీసీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేకాధికారి జాకీర్‌హుసేన్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బీసీ బాలికల వసతి గృహం ఆవరణలో మొక్కలు నాటారు. హెచ్‌ఎం. కోటయ్య, సంక్షేమ అధికారిణి హరిత, మండల పరిషత్, గ్రామపంచాయతీ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలను రక్షిస్తే.. అవి మనల్ని సంరక్షిస్తాయి



మొక్కలు నాటుతున్న వైస్ చాన్సిలర్ నాయక్

నంద్యాల(న్యూటౌన్): మనం మొక్కలను రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక వివేకానందరెడ్డి ఆడిటోరియంలో చైర్మన్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన స్వచ్ఛతా హీ సేవ, ఏక్‌పేడ్ మాకీనామ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ ప్రవేశపెట్టిన స్వచ్ఛతా హీ సేవ ఏక్‌పేడ్ మాకీనాం కార్యక్రమంలో భాగంగా మొక్కలను పెంచి రక్షించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఓ యోగేశ్వరరెడ్డి, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్బయ్య, మురళీ, కమాల్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

నంద్యాల(అర్బన్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే సామాజిక భద్రత ఉంటుందని ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల మేజర్ పంచాయతీ కానాల గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చదనం మొక్కలు నాటడం ద్వారానే సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఇందిరా, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

గోస్పాడు: మద్యం విక్రేత ముల్లా హుసేన్‌పీరాను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వెంకటప్రసాద్ తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించారు. 29 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడం దారుణం

నంద్యాల(అర్బన్): ఆన్‌లైన్ మోసంతో ఆత్మహత్య చేసుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు సయ్యద్ ఖలీల్ అహమ్మద్ కుటుంబాన్ని రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ పరామర్శించకపోవడం దారుణమని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూనిస్ అన్నారు. మూడు రోజులైనా బాధిత కుటుంబానిరకి మంత్రి వచ్చి భరోసా ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలకు ఎవరూ గురికాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందు కోసం మంత్రి హోదాలో ఫరూక్ ప్రభుత్వంతో చర్చలు జరిపి ఆన్‌లైన్ వ్యాపారాలకు తెరదించాలన్నారు. ఇప్పటికైనా బాధిత కుటుంబాన్ని పరామర్శించి న్యాయం జరిగేలా చూడాలని మంత్రిని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



గర్భిణులు, బాలింతలకు సూచనలు ఇస్తున్న కేవీకే హోం సైంటిస్టు

దొర్నిపాడు: ప్రతి తల్లీ పౌష్టికాహారం తీసుకోవడం వల్లనే తల్లీబిడ్డకు ఆరోగ్యం చేకూరుతుందని కృషి విజ్ఞాన కేంద్రం హోంసైంటిస్టు లక్ష్మిప్రియ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంతా శుక్రవారం స్థానిక పాత గ్రామ పంచాయతీ కార్యలయ ఆవరణలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పోషక విలువలు కల్గిన ఆహారం తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ శకుంతల, ఐసీడీఎస్ సీడీపీఓ తేజేశ్వరి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ రామచంద్రయ్య, ఐసీడీఎస్ సూపర్ వైజర్ ప్రభాకరమ్మ పాల్గొన్నారు.

చాగలమర్రి: స్థానిక ఆజీం బ్రిలియంట్ ఉన్నత పాఠశాలలో పౌష్టికాహార ప్రాముఖ్యతపై శుక్రవారం అవగాహన సదస్సు ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ సమత పోషకాహారంపై వివరించారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మిద్దె శివరాం

నంద్యాల(న్యూటౌన్): గెలుపోటములను సమానంగా తీసుకోవాలని శాంతిరాం మెడికల్ కళాశాల డైరెక్టర్ మిద్దె శివరాం క్రీడాకారులకు సూచించారు. పట్టణ సమీపంలోని ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఏర్పాటు చేసిన క్రీడా పోటీలు ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్ తదితర పోటీలను నిర్వహించారు. త్రోబాల్ బాలికల విభాగంలో ఆర్‌జీఎం విన్నర్స్ కాగా నంద్యాల పబ్లిక్ స్కూల్ రన్నర్స్‌గా నిలిచింది. టెన్నికాయిట్‌లో ఆర్‌జీఎం విన్నర్స్ కాగా శాంతిరాం ఇంజనీరింగ్ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. డోగ్జిబాల్ పోటీల్లో ఆర్‌జీఎం ప్రథమ, నంద్యాల పబ్లిక్ స్కూల్ ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. టగ్ ఆఫ్ వార్‌లో ఆర్‌జీఎం విన్నర్స్‌గా, నంద్యాల పబ్లిక్ స్కూల్ రన్నర్స్‌గా నిలిచారు. ఈ నెల 21న ఫైనల్ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేయనున్నట్లు మిద్దె శివరాం తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు చంద్రారెడ్డి, ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్ర ప్రసాద్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ శెట్టి, ఆర్‌జీఎం ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ గాయత్రి పాల్గొన్నారు.

దొర్నిపాడులో భారీ వర్షం



దొర్నిపాడులో కురుస్తున్న వర్షం

దొర్నిపాడు: అప్పటి వరకు ఎండ మండిపోయింది. అయితే ఇంతలోనే వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకొని కారుమబ్బులు కమ్ముకుని భారీ వర్షం కురిసింది. శుక్రవారం మధ్యాహ్నం మండలంలోని దొర్నిపాడు, బుర్రారెడ్డిపల్లె, చాకరాజువేముల గ్రామాల్లో అగంటపాటు భారీ వర్షం కుసింది. చుట్టుపక్కల పల్లెల్లో చినుకు జాడలేదు. ఈ వర్షం పత్తి పంట ఊరటనిచ్చిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.